ప్రజాశక్తి
శనివారం 7 అక్టోబర్ 2023
5
పార్వతీపురం మన్యం



నేడు 'నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్'పై సదస్సు


ప్రజాశక్తి - బెలగాం

నేషనల్ లైవ్ స్టాక్ మిషన్‌పై అవగాహన సదస్సును శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి జి.రత్నాకర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో "నేషనల్ లైవ్ స్టాక్ మిషన్" పై జిల్లా స్థాయి అవగాహన సదస్సు శనివారం ఉదయం 10 గంటల నుండి బైపాస్ రోడ్డులో గల సి - కన్వెన్షన్ హాల్‌లో జరుగుతుందని ఆయన చెప్పారు. జిల్లా, మండల, ఆర్‌బికె స్థాయి వ్యవసాయ సలహా మండలి చైర్మన్లు, సభ్యులు, గొర్రెలు, మేకలు సహకార సంఘాల సభ్యులు, ఔత్సాహిక పశుగణ వ్యాపారవేత్తలు, రైతులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఇతర అధికారులు పాల్గొంటారని ఆయన అన్నారు.

ఇంకా వెనుకబాటే

- పాలకుల్లో కొరవడిన చిత్తశుద్ధి
- అభివృద్ధికి నోచుకోని గిరిజన గ్రామాలు

స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశబ్దాలు గడిచిపోయాయి. ప్రపంచం సాంకేతిక రంగంలో పరుగులు తీస్తూ అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే మారుమూల కొండలపైనున్న గిరిజన ప్రాంతాలు మాత్రం నేటికీ వెనుకబడి ఉన్నాయి. అభివృద్ధికి నోచుకోక కనీస సౌకర్యాలకు దూరమయ్యాయి. ఎన్నో ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా, అధికారులు వచ్చి వెళ్తున్నా గిరిజన జీవితాల్లో మాత్రం మార్పు రాలేదు. గిరిజన సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంఘం ఎన్నో సార్లు పాదయాత్రలు, ధర్నాలు, ఆందోళన చేపడుతున్నా అధికారులు, పాలకుల్లో చలనం ఉండడం లేదు. దీంతో వేలాది మంది గిరిజనులు విద్య, వైద్యం, తాగునీరు వంటి కనీస మౌలిక వసతులకు నోచుకోక దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు.



అభివృద్ధికి నోచుకోని గిరిజన గ్రామం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో కొండశిఖర గ్రామాలకు నేటికీ రహదారి సౌకర్యం లేకపోవడంతో బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటూ బతుకులు వెళ్లదీస్తున్నారు. శిఖరపాయి, జాపయి, వాడబాయి, వామసి, కప్పుఖల్లు, దేరుగండ, వన కాబడి వాడ పుట్టి, జోగి పురం, శంభుగూడ, వాడ జంగి, ఇజ్జ కాయి, టంకు, గుల్లలంక, మంత్ర జోల, చిన్న రావి కోన, కొండ బిన్నిడి, బయ్యాడ తదితర మారుమూల గ్రామాలకు రోడ్డు మార్గం లేకపోవడంతో వాహన సౌకర్యం లేక నేటికీ కాలిబాటనే రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతినెలా రేషన్ బియ్యం, నిత్యవసర వస్తువుల కొనుగోలు, ఇతర పనుల నిమిత్తం నాలుగైదు కిలోమీటర్లు కొండ దిగితేనే వీరికి కడుపునిండేది. ఇక్కడ బోరు బావులు లేక ఊట బావులు, చలములపైనే ఆధారపడి జీవనం గడుపుతున్నారు. కలుషితమైన నీరు తాగడంతో గిరిజనులు ఎప్పటికప్పుడు వ్యాధుల బారిన ఆసుపత్రి పాలవుతున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

శిథిలమైన ఇళ్లలోనే జీవనం....

ఎన్నో ఏళ్ల కిందట నిర్మించుకున్న మట్టి గోడల రేకిళ్లు, పూరిపాకలోనే గిరిజనులు తల దాచుకుంటున్నారు. పక్కా గృహాలు మంజూరైనా కొండల మీదకు ఇంటి నిర్మాణ సామాగ్రి తీసుకువెళ్లడానికి వీల్లేకపోవడం కట్టుకోలేని పరిస్థితి. శిథిలమైన ఇళ్లలోనే క్షణక్షణం భయంతో కాలం గడుపుతున్నారు. ఇక్కడ గిరిజన విద్యార్థులకు విద్య అందని ద్రాక్ష గానే ఉంటుంది.

పడకేసిన చెక్ డ్యాములు...

ఏజెన్సీ ప్రాంతంలో పంట పొలాలకు సాగునీరందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వాల హయాంలో నిర్మించిన మినీ రిజర్వాయర్లు, చెక్ డ్యాములు నిర్వహణ లోపంతో పడకేశాయి. గంగ్ర, కొత్తగూడ, వంగర, కీసర, కీసరగూడ, దుమ్మంగి తదితర ప్రాంతాల్లో మైనర్ ఇరిగేషన్, పిటిజి, ఉపాధిహామీ నిధులతో చెక్‌డ్యామ్ నిర్మాణాలు చేపట్టారు. అయితే నిర్వహణా లోపం కారణంగా శిథిలమయ్యాయి. సీమలగూడ మినీ రిజర్వాయర్ అభివృద్ధికి మూడుసార్లు ప్రతిపాదనలు చేసిన కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఖరీఫ్ సీజన్‌లో పంట పొలాలకు సాగునీరు పూర్తిస్థాయిలో అందని పరిస్థితి.

వైద్యం అంతంత మాత్రమే

ఏజెన్సీలో వైద్య సేవలు గిరిజనులకు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆసుపత్రుల వద్ద రోగుల తాకిడి పెద్ద సంఖ్యలో ఉంటుంది. మంచాలు చాలకపోవడంతో ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు రోగులు వైద్యం పొందుతున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. మలేరియా, టైఫాయిడ్ డెంగీ వ్యాధులకు సరైన వైద్యం అందకపోవడంతో పార్వతీపురం, విజయనగరం వంటి దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం పొందుతున్నారు. తాడికొండ, దుడ్డుఖల్లు, రేగిడి పిహెచ్‌సిల్లో సరైన సౌకర్యాలు లేక గర్భిణీలను ప్రాథమిక చికిత్స అనంతరం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించడం పరిపాటిగా మారింది. కొండలపై గ్రామాలకు రోడ్డు మార్గం లేకపోవడంతో 108 అంబులెన్స్ సేవలు వీరికి అందడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో డోలీల సాయంతో రోగులను కొండ కిందకు తీసుకువచ్చి అక్కడ నుంచి ఆసుపత్రులకు తరలిస్తున్నారు. దీంతో మార్గమధ్యలో మృత్యువాత పడిన గిరిజనులు ఎంతోమంది ఉన్నారు.

గిరిజనుల పట్ల చిన్నచూపు

ప్రభుత్వాలు, అధికారులు మారుతున్న గిరిజనుల పట్ల చిన్నచూపు కొనసాగుతూనే ఉంది. మా సమస్యలు పరిష్కరించండి బాబు అంటూ వందలాది సార్లు వినతులు సమర్పించిన స్పందించలేదు. గిరిజన సంక్షేమం పట్లని ప్రభుత్వాలు ఉన్నా లేకున్నా ఒక్కటే.

కోలక అవినాష్
ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

కొండలపై గిరిజన గ్రామాల్లో ప్రజల కష్టాలను గుర్తించాలి. రోడ్డు నిర్మాణం చేపట్టి తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపడితే గిరిజన కష్టాలు కొంతమేర తీరుతాయి.

పువ్వల తిరుపతిరావు
సిపిఎం నాయకులు



డోలీలో రోగిని ఆసుపత్రికి తీసుకెళ్తున్న గిరిజనులు (ఫైల్)



గెడ్డవాగు నీటిని తీసుకు వెళ్తున్న మహిళలు (ఫైల్)



కషాయాల తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

అధిక దిగుబడులు సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భామిని

ప్రతి రైతు అధిక దిగుబడులు సాధించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. సంకల్ప సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా భామినిలో శుక్రవారం నిర్వహించిన కృషి మహోత్సవంలో కలెక్టర్ పాల్గొన్నారు. కృషి మహోత్సవంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన శాలలను పరిశీలించారు. రైతులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆశావహ జిల్లాల్లో ఒక్కో మండలాన్ని ఒక బ్లాక్‌గా తీసుకుని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అవకాశాలు కల్పించాలని సంకల్పించిందని చెప్పారు. పిఎం కిసాన్ - రైతు భరోసా కార్యక్రమం కింద ఏడాదికి రూ.13,500 ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనం నుంచి విక్రయం వరకు గల అవకాశాలను తెలియజేస్తున్నామన్నారు. సమీకృత వ్యవసాయ లాబ్‌లను ఏర్పాటు చేసి భూసారం తెలుసుకోవడం, దానికి అనుగుణంగా ఏ పంటలు వేయడం లాభదాయకం వంటి అంశాలను తెలుసుకోవాలని ఆయన అన్నారు. భూమిలో ఏ ధాతువు తక్కువగా ఉందో తెలుసుకుని దాన్ని ఉపయోగించాలని ఆయన పేర్కొన్నారు. కియాస్కో వినియోగం ఉపయోగకరం అన్నారు. కస్టమ్ హాయర్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆధునిక వ్యవసాయ పనిముట్లు రైతుల ముంగిటకు తీసుకురావడం జరిగిందని చెప్పారు. తక్కువ అద్దెతో ఆధునిక వ్యవసాయ పనిముట్లు వినియోగించుకోవచ్చని తద్వారా తక్కువ పెట్టుబడితో వ్యవసాయ పనులు పూర్త వుతాయని అన్నారు. రైతులు అంతర పంటలు, తక్కువ సమయంలో దిగుబడి ఇచ్చే అపరాలు వేయాలని, పాడి పంటల్లో భాగంగా కోళ్లు, గొర్రెలు, మేకలు, ఆవులు, చేపలు పెంపకం చేపట్టాలని తద్వారా ఆదాయం వస్తుందని ఆయన సూచించారు. అంతర్జాతీయ చిరు ధాన్యాలు సంవత్సరం నిర్వహించడం జరుగుతుందని, సంప్రదాయ చిరు ధాన్యాలకు ప్రస్తుతం ప్రాధాన్యత ఉందని, వాటి సాగుపై దష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు. రైతు కుటుంబాలు ఆర్థిక మనుగడ దిశగా దష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు. పిల్లలకు బడిలో చేర్పించాలని, ఉన్నత విద్యను అందించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి, జిల్లా వ్యవసాయ అధికారి కె రాబర్ట్ పాల్, వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణం జరుగుతున్న పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులను ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణం జరుగుతున్న భవనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులను, భవన నిర్మాణ కాంట్రాక్టర్ల తో మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాలు లేకుండా త్వరగతిగా పనులు పూర్తిచేసి భవనాన్ని అప్పగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎ ఎస్పీ ఒ.దిలీప్ కుమార్, కురుపాం ఎస్సై సిహెచ్ ప్రసాద్, చినమేరంగి ఎస్సై కళాధర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జ్యూట్ మిల్లు లాకౌట్‌పై కార్మికశాఖా మంత్రికి లేఖ

త్వరలో లేబర్ కమిషనర్‌తో డిప్యూటీ సిఎం భేటీ

ప్రజాశక్తి - సాలూరు

జిల్లాలో ఉన్న ఏకైక పరిశ్రమ ఆంధ్రా ఫైబర్స్ జ్యూట్ మిల్లు అక్రమ లాకౌట్‌పై డిప్యూటీ సిఎం రాజన్నదొర దృష్టి సారించారు. ఈ మేరకు ఆయన కార్మికశాఖ మంత్రి జి.జయరాం, కార్మికశాఖ కమిషనర్‌కు లేఖలు రాశారు. ఇప్పటికే విశాఖపట్నంలో ఉన్న జాయింట్ కమిషనర్‌కు లేఖ రాశారు. జెసిఎల్ వద్ద రెండు దఫాలుగా కార్మిక సంఘాల జెఎసితో జరిగిన చర్చలకు మిల్లు యాజమాన్యం హాజరు కాలేదు. గత 45రోజులుగా కార్మికుల జెఎసి ఆధ్వర్యాన రిలే దీక్షలు చేపడుతున్నారు. 16నెలలుగా మిల్లు మూతపడ్డంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో వారు రిలే దీక్షలు చేస్తూ మరో వైపు సామరస్య పూర్వకంగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు. మిల్లు అయినా నడపాలని లేదా కార్మికులకు సెటిల్మెంట్ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే యాజమాన్యం మాత్రం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. జెసిఎల్ వద్ద చర్చలకు కూడా హాజరు కాకపోవడంతో పరిస్థితిని జెఎసి నాయకులు శుక్రవారం డిప్యూటీ సీఎం రాజన్నదొరను కలిసి వివరించారు. దీంతో ఆయన రంగంలోకి దిగారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జయరాం, కమిషనర్‌కు లేఖలు రాసినట్లు చెప్పారు. 1200మంది కార్మిక కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నాయని, లాకౌట్ సమస్యను పరిష్కరించడానికి చొరవ చూపాలని కోరుతూ ఆయన లేఖలు రాశారు. ఈనెల 17,18 తేదీల్లో చర్చలకు అవకాశం కల్పించాలని ఆయన లేఖలో కోరారు. కార్మిక సంఘాల జెఎసి నాయకులు రెడ్డి సింహాచలం, రెడ్డి సత్యం డిప్యూటీ సీఎం రాజన్నదొర ని కలిసిన వారిలో వున్నారు.

9న రాష్ట్ర ఆహార భద్రతా కమిటీ సభ్యుల పర్యటన

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ఆహార భద్రత కమిటీ సభ్యులు బి.కాంతారావు జిల్లాలో ఈనెల 9న పర్యటిస్తారని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 9,10 తేదీల్లో ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వాహిస్తారని, అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారన్నారు. జిల్లా అధికారులు ఈ సమీక్షా సమావేశానికి హాజరు కావాలని ఆ ప్రకటన లో తెలిపారు.

ఏడు రాగుల కొనుగోలు కేంద్రాలు : జెసి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జిల్లా వ్యాప్తం రాగులు పంటను ప్రోత్సహించేందుకు అనుగుణంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో మద్దతు ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాల మాదిరిగా ఖరీఫ్ 2023-24 సీజనుకు సంబంధించి ధాన్యం కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు గాను రాగుల మద్దతు ధర క్వింటాకు రూ.3846గా నిర్ణయించామని తెలిపారు. వ్యవసాయ శాఖ వారి రాగులు దిగుబడి అంచనాలకు అనుగుణంగా ఈనెల 20 నుండి రాగులు పండించిన విస్తీర్ణం గల రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రభుత్వం తరపున రాగుల కొనుగోలు ప్రారంభించడానికి సన్నాహాలు పూర్తి చేశామని తెలిపారు. రైతులు తాము పండిచిన రాగులను ప్రభుత్వం వారు ప్రకటించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి సరుకు అమ్ముకోవచ్చని అన్నారు. ఈ కొనుగోలులో రైతులెవ్వరు కూడా దళారులను నమ్మి మోసపోకూడదన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం వారు ధాన్యము కొనుగోలు ప్రక్రియ మదిరిగానే రాగుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి ముఖ్య ఉద్ధేశ్యమని తెలిపారు. ఈ ముకఎ జిల్లాలో సీతంపేట, సాలూరు, పాచిపెంట, పార్వతీపురం, కొమరాడ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం లో రాగుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో మొత్తం రాగుల ఉత్పత్తి 936 టన్నులు కాగా, రైతులు వినియోగం 468 టన్నులు పోగా. 468 టన్నులు.కొనుగోలుకు అంచనాలు వేస్తున్నామని తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు ముమ్మర ఏర్పాట్లు

ప్రతి సీజన్ లాగానే రాబోయే 2023-24లోనూ ధాన్యం సేకరించే నిమిత్తం ముమ్మర ఏర్పాట్లు చేస్తుందని జెసి గోవిందరావు అన్నారు. ఈ సీజన్‌లో కూడా వివిధ రైతు భరోసా కేంద్రాల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు, తద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతులకు మేలు కలిగేలాకనీస మద్దతు ధర పూర్తిస్థాయిలో అందించేందుకు ప్రభుత్వం తరుపున సన్నాహాలు ప్రారంభించామని తెలిపారు. 2023-24 పంట కాలానికి గానూ ధాన్యం కనీస మద్దతు ధర సాధారణ రకం క్వింటాలకు రూ.2183, గ్రేడ్ ఎ రకం రూ. 2203 లు ప్రకటించారని, అయితే ఈఏడాది రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే వాహనాలకు జిపిఎస్ యంత్రాల వినియోగం తప్పని సరి చేశామని అన్నారు. ఈసీజన్‌లో బయోమెట్రిక్ విధానం అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇక్రాప్‌లో నమోదై, ఈకెవైసి చేయించుకున్న రైతుల దగ్గర మాత్రమే ధాన్యం సేకరణ జరుగుతుందని అన్నారు. కొనుగోలు విషయంలో రైసుమిల్లర్లను ఏ రైతు సంప్రదించాల్సిన అవసరం లేదని, వారి ఎంపిక ప్రభుత్వం చూసుకుంటుందని తెలిపారు. రైతుల సౌకర్యార్థం గోనెసంచులు, హమాలీలు, ఏర్పాట్లు కూడా ప్రభుత్వం చూసుకుంటుందని, అన్నారు. ఒకవేళ వాటిని రైతులు ఏర్పాటు చేసుకుంటా అందుకు తగిన మొత్తాన్ని రైతుల ఖాతాలకు జమచేస్తామని తెలిపారు.



సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజారోగ్యానికి పెద్దపీట : రాజన్నదొర

ప్రజాశక్తి - పాచిపెంట

రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పి.రాజన్నదొర అన్నారు. అందరూ సుఖంగా, సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని జగనన్న ఆరోగ్య సురక్ష (జె.ఎ.ఎస్) కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. మండలంలోని కర్రివలసలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి శుక్రవారం పాల్గొన్నారు. అందరూ ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. వైద్య, ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను ఆయన పరిశీలించారు. శిబిరాలకు వచ్చిన వ్యక్తులతో మాట్లాడి వైద్యం అందుతున్న విధానాన్ని ఆరా తీశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన పౌష్ఠికాహారం ప్రదర్శన శాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ వైద్య శిబిరాల్లో 172 రకాల మందులు, 14 రకాల పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు. ప్రతి ఒక్కరికీ మంచి వైద్య సేవలు అందించాలని, ఎంత ఖర్చు అయినప్పటికీ భరించుటకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం 45 రోజుల పాటు సాగుతుందని అన్నారు. జిల్లాలో నవంబరు 10 వరకు వైద్య శిబిరాలు జరుగుతాయన్నారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్స్ ను ఆయన పరిశీలించారు కార్యక్రమంలో డిఎస్ఒ శివప్రసాద్, ఎంపిడిఒ డాక్టర్ శివకుమార్, సిడిపిఒ బి.అనంతలక్ష్మి పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాలకొండ

నగర పంచాయతీలో డంపింగ్ యార్డ్ సమస్య తక్షణమే పరిష్కరించాలని, చెత్తను తక్షణమే గ్రామానికి దూరంగా తరలించాలని, సంపూర్ణ పారిశుధ్య నివారణకు కార్మికుల సంఖ్యను పెంచాలని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణంలో చెత్తకుప్ప వద్ద సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పాలకొండ మండల కమిటీ కన్వీనర్ డి. రమణారావు మాట్లాడుతూ పట్టణం రోజు రోజుకు విస్తరిస్తుందని, సంపూర్ణ పారిశుధ్యానికి సరిపడా కార్మికుల్లేరని అన్నారు. వెంకంపేటకు ఆనుకొని తాత్కాలికంగా డంపింగ్ యార్డ్ గతలో ఏర్పాటు చేశారని, అది నెల రోజులు మాత్రమే ఉంటుందని, పట్టణానికి దూరంగా డంపింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. కానీ నేటికీ ఈ సమస్య పరిష్కరించలేదని, దీంతో ఆ ప్రాంత ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ఎక్కడ చెత్త అక్కడే ఉండడం వల్ల ప్రజల అనారోగ్యాలకు గురయ్యే అవకాశం కనిపిస్తుందని అన్నారు. ఒకవైపు జగనన్న ఆరోగ్య సురక్ష అని ప్రభుత్వం కార్యక్రమం తీసుకుంటే పాలకొండ పట్టణంలో మాత్రం సంపూర్ణ పారిశుధ్యానికి కావాల్సిన ఏర్పాట్లు చేయడంలో పాలకవర్గం విఫలమైందని, తక్షణమే పాలకొండ సంపూర్ణ పారిశుధ్య నివారణకు చర్యలు తీసుకోవాలని, లేకుంటే ప్రజలను సమీకరించి ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కె.రాము, డి. దుర్గారావు, ఎ.లక్ష్మణరావు, ఎం.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో పిజి సెంటర్ ఏర్పాటు చేయాలి

- పోస్టుమెట్రిక్ హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలి
- సైకిల్ యాత్రలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పావని డిమాండ్

ప్రజాశక్తి - పాలకొండ

నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రేవేట్ విద్యాసంస్థల్లో వందలాది మంది విద్యార్థులు చదువుతున్నప్పటికీ పాలకొండ కేంద్రంలో పీజీ కళాశాల ప్రభుత్వం నిర్మించకపోవడం చాలా దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ సిహెచ్.పావని మండిపడ్డారు. ఎస్ఎఫ్ఐ చేపడుతున్న విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర శుక్రవారం మండలానికి చేరుకుంది. మొదటగా స్థానిక విద్యాసంస్థల విద్యార్థులతో ఆర్టీసీ డిపో జంక్షన్ నుండి మెయిన్ రోడ్డు మీదుగా తిరిగి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి పావని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసేలా తమ విధానాలను అనుసరిస్తున్నాయని విమర్శించారు. జగనన్న ప్రభుత్వం మెరుగైన విద్యను అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కనీసం ప్రహరీ గోడ లేకపోవడం వల్ల కళాశాల నిష్పత్తి శాతం పడిపోతుందని, ఉన్నత చదువులకై పీజీ సెంటర్, సొంత హాస్టల్ భవనం లేకపోవడంతో విద్యార్థులు చదువులు మధ్యలోనే నిలిపిచిపోయే పరిస్థితి కనిపిస్తుందని అన్నారు. కావున ప్రభుత్వ వెంటనే స్పందించి మెరుగైన విద్యాభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో నియోజకవర్గ మండల కేంద్రం విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ చేపడుతున్న పోరాట కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సంక్షేమ హాస్టళ్లకు బకాయిలు మెస్ (డైట్) బిల్లులు వెంటనే విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ బిల్లులు పెంచాలని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తొలగించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని, మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని, డిగ్రీలో తీసుకువచ్చిన హనర్స్ - మైనర్ సబ్జెక్టు విధానాన్ని రద్దు చేయాలని, డిగ్రీ విద్యార్థులు ఇంటర్న్ షిప్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్ఇపి రద్దు చేయాలని, 117 జిఒ రద్దు చేయాలని, పాఠశాలల విలీనం ఆపాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, హాస్టలల్లో పర్మినెంట్ వర్కర్లను, వార్డన్లను నియమించాలని, పోస్టుమెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, హాస్టళ్లలో ఎఎన్ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. లేనిచో యాత్ర అనంతరం పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు కె.రాజు, హెచ్.సింహాచలం, బి.గంగారావు, కె.భాస్కరరావు, యాత్రలో ఎస్ఎఫ్ఐ నాయకులు అఖిల్, ఉమాశంకర్, సిసింద్రీ, అన్నాజీ, వెంకీ పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పావని

ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు పోషకాహారం పంపిణీ సమయంలో అమలు చేస్తున్న ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం ఐసిడిఎస్ ప్రాజెక్టు అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఎసిడిపిఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులకు పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న సమయంలో ఏజెన్సీ ప్రాంతాల్లో సెల్ ఫోన్లు సరిగ్గా సిగ్నల్స్ లేక పనిచేయకపోవడంతో ఎఫ్ఆర్ఎస్ యాప్ అమలు కావడం లేదన్నారు. దీంతో బాలింతలు, గర్భిణీలను పదేపదే కేంద్రాలకు రప్పించే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు టి.ప్రభావతి, ఎన్.పైడిరాజు, పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మ-నాన్న ఓ వృద్ధాశ్రమం కవితకు ప్రశంస

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో అమ్మ నాన్న ఓ వృద్ధాశ్రమం అంశంపై నిర్వహించిన కవితల పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన పెద్దింటి నిర్మల్ కుమార్‌కు శ్రీశ్రీ కళా వేదిక సభ్యులు ప్రశంసాపత్రం అందజేశారు. సుమారు వందమంది కవులు ఆన్లైన్ కవితల పోటీల్లో పాల్గొనగా ఏజెన్సీ ప్రాంతానికి చెందిన నిర్మల్ కుమార్ ప్రతిభ చూపడం అభినందనీయమని కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ప్రశంసించారు. నిర్మల్‌కుమార్ ఎల్విన్‌పేట ఎంపిపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



ఆడలి వ్యూపాయింట్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పర్యాటక పనులు వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి - సీతంపేట

పర్యాటక పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో శుక్రవారం పర్యటించిన అభివృద్ధి కార్యక్రమాలను తనిఖీ చేశారు. మండలంలోని ఆడలి వ్యూ పాయింట్ అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. పనులను వేగవంతంగా నవంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపించకూడదని ఆయన స్పష్టం చేశారు. ముందుగా నిర్ణయించిన ప్రణాళిక ప్రకారమే పనులు చేపట్టాలన్నారు. గిరిజన మ్యూజియం పనులను పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యాటకుల తాకిడి జిల్లాలో ముఖ్యంగా సీతంపేట ప్రాంతంలో ఎక్కువగా ఉందని దాన్ని మరింత పెంచాలన్నారు. పర్యాటకుల సంఖ్య పెరగడం వల్ల చిన్న వ్యాపారాలు పెరుగుతాయని, స్థానికులకు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ఒక ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి, గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ సింహాచలం, జేఈ భూషణ్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల తరలింపులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అడవి ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిడిపి అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు అన్నారు. అడవి ఏనుగులు సంచారంతో ప్రజలు ప్రాణాలు పోతున్నా, పంటలకు తీవ్రం నష్టం వాటిల్లుతున్నా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం కనీసం కూడా స్పందించకపోవడం శోచనీయం అన్నారు. అసలే ఖరీఫ్ సీజన్ పంటలు చేతికి వచ్చే సమయంలో ఏనుగులు తిరుగుతూ పూర్తిగా నాశనం చేస్తున్నాయన్నారు. రైతులకు పంట నష్టపరిహారం కూడా అందించలేదన్నారు. ఏనుగుల సంచారంతో ఇటు ప్రజలు, అటు విద్యార్థులు క్షణక్షణం భయంతో కాలం గడుపుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కృష్ణ బాబు కోరారు.

సేవలకు ప్రశంసలు

ప్రజాశక్తి -భామిని

మండలంలోని నూలకజోడు గ్రామానికి చెందిన తామర సెల్లి సురేష్ ఎపిజివిబి అనుబంధ జిటిఐడిఎస్ ప్రాంతీయ నిర్వాహకులుగా, బ్యాంకు మిత్రలను సమన్వయం చేస్తూ మంచి సేవలు అందించినందుకును ఆయనను శుక్రవారం సన్మానించారు. ఎపిజివిబి రీజినల్ మేనేజర్ బి.రాఘవేంద్ర, డిఒఎఫ్ఐసి జె.వాసు, జిటిఐడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. రాంబాబు శాలువా తో సత్కరించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ, ఇటువంటి సన్మానాలు వృత్తి పట్ల మక్కువ, గౌరవం కలిగిస్తాయని తెలిపారు.



జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర జీవితం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని చెముడుగూడ పంచాయతీ పుట్టజమ్ములో సర్పంచి నిమ్మక చంద్రకళ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయ పంటలపై ఆసక్తి కనబరచాలని కోరారు. రసాయన ఎరువుల్లేని పోషకాలు కలిగి ఉన్న పంటలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం కోఆర్డినేటర్ భూషణ్ మాట్లాడుతూ రైతులంతా ఇ-క్రాప్ రిజిస్ట్రేషన్ అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్ద చేయించుకోవాలన్నారు. జీవామృతం, జిల్లేడు ఆకులు ద్రావణం తయారీ విధానం చేస్తూ ఆ కషాయాన్ని బాటిల్ రూపంలో ప్రతి ఒక్కరికీ ఇస్తూ అవగాహన కల్పించారు. వచ్చే సంవత్సరం పూర్తి స్థాయిలో నూటికి నూరు శాతం బయోగ్రామాలుగా ప్రకటించాలని ఒక నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు మండంగి రమణ, వైసిపి నాయకులు నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మండంగి అశోక్ తదితరులు ఉన్నారు.

ఆర్‌బికె సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రైతుభరోసా కేంద్రాల సేవలను రైతులు వినియోగించుకోవాలని ఉల్లిభద్రపశుసంవర్ధక శాఖఅధికారి డాక్టర్ ఎస్.సురేష్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని పిట్టలమెట్టలో శుక్రవారం పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం రాయితీపై గడ్డిని కత్తిరించే యంత్రాలను మంజూరు చేస్తుందని, ఈ యంత్రం కావాల్సిన రైతులు పశుసంవర్ధకశాఖ అధికారులను సంప్రదించాలని కోరారు. డాక్టర్ వైఎస్ఆర్ సంచారపశుఆరోగ్యసేవల గురించి పాడి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరి అధికారి మంత్రబుడ్డి శ్రీరాములునాయుడు, వెంకటనాయుడు, స్వాతి, లక్ష్మి, పాడిరైతులు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంవిఐ సత్యనారాయణ

రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

రహదారి భద్రతా వారోత్సవాలు సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ డిజిఎస్‌వి త్రినాథ్ అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి సత్యనారాయణ అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు, వాహనం నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పార్వతీపురం జిల్లా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ నారాయణ రోడ్డు ప్రమాదాలు జరిగేటప్పుడు ప్రథమ చికిత్స ఏ విధంగా చేయాలో వివరించారు. సమావేశంలో కాలేజీ ప్రిన్సిపల్ డిజిఎస్‌వి త్రినాథ్, ఎన్ఎస్ఎస్ పిఒ డి.రామకృష్ణ, బి.రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు మాదిగల పాదయాత్ర

ప్రజాశక్తి - పాలకొండ

రానున్న శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7న అలంపూర్ నుండి మాదిగల విశ్వరూప మహాపాదయాత్ర జరుగుతుందని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర కమిటీ నాయకులు అలజంగి చిన్నారావు, పాలకొండ నియోజకవర్గ అధ్యక్షులు లోపింటి జడ్డియ్య తెలిపారు. స్థానిక కస్పా వీధి ఆవరణలో విశ్వరూప మహాపాదయాత్రకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. వచ్చే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించకపోతే వచ్చే ఎన్నికల్లో బిజెపికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భామిని

జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కోరారు. మండలంలోని ఒడ్డంగిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. అన్ని కౌంటర్లను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది హాజరు, చికిత్స కోసం వచ్చిన ప్రజలు, వైద్య సేవలను పరిశీలించారు. ఉత్తమ సేవలు అందించాలని వైద్యులను, సిబ్బందిని సూచించారు. పేదలు, దూర ప్రాంతాల ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) కార్యక్రమం ఒక గొప్ప అవకాశం అన్నారు. నిపుణులైన వైద్యులు తమ వద్దకు వచ్చి వైద్య సేవలు అందించడం జరుగుతుందని వివరించారు. సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి, వైద్య అధికారులు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని తిత్తిరి పంచాయతీ టోంపలపాడు సచివాలయంలో జరిగిన ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం ఎంపిపి శెట్టి పద్మావతి పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బి. సత్యనారాయణ, ఎంపీడీవో వి.వి. శివరామప్ప, వైద్యాధికారులు, జెడ్పిటిసి జి.సుజాత, వైసిపి వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు,వైస్ ఎంపిపి లు, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

సాలూరు: పట్టణంలోని 4,5,6 సచివాలయాలకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.జయరాం చెప్పారు. ఈ శిబిరానికి ఆయా సచివాలయాల పరిధిలో ఉన్న ప్రజలు, రోగులు హాజరు కావొచ్చునని ఆయన ఒక ప్రకటన లో కోరారు.

వీరఘట్టం: మండలంలోని కత్తుల కవిటిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వి.కళావతి ప్రారంభించారు. రోగులకు స్పెషలిస్టులు వైద్యులు, సిబ్బంది చేస్తున్న స్క్రీనింగ్ వైద్య పరీక్షలు, తదితర వాటిని పర్యవేక్షించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.సరోజిని, ఎంపిపి డి.వెంకటరమణనాయుడు, తహశీల్దార్ సత్యనారాయణ, దిలీప్‌కుమార్, వైద్యాధికారులు మానస, దిలీప్ కుమార్, ఉమామహేశ్వరి, భవ్య, జడ్పిటిసి జంపు కన్నతల్లి ఉమామహేశ్వరరావు, బి.గౌరినాయుడు, సచివాలయ కార్యదర్శి రాము, ఎంపిటిసి కె.పరిమిల, వైద్య సచివాలయ సిబ్బందితో పాటు విఆర్ఒలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని మారుమూల ఏజెన్సీ గ్రామమైన వనకాబడిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న సుమారు 310 మంది రోగులు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. రోగులకు అవసరమైన మందులను అందించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్ రాజు, ఎంఇఒ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి శెట్టి రామకృష్ణ, నరేష్ ఇతర శాఖ అధికారులు, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని ఉల్లిభద్రలో ఈనెల 25న నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సచివాలయం కార్యదర్శి ఉప్పల పెదకోటేశ్వరరావు, కొండవరం గ్రామపంచాయతీ కార్యదర్శి చింతల వెంకట కురిమినాయుడు కోరారు. ఈ మేరకు ఉల్లిభద్ర గ్రామసచివాలయంలో సచివాలయ, వైద్య సిబ్బంది, వాలంటీర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం విజయవంతానికి సిబ్బంది అంతా కృషి చేయాలని ఆదేశించారు.

సీతానగరం : మండలంలో వెంకటాపురంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొన్నారు.



సీతానగరం : పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

శిబిరాలకు వచ్చిన వారితో మాట్లాడి వైద్యం అందుతున్న విధానాన్ని ఆరా తీశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన పౌష్టికాహారం ప్రదర్శన శాలను పరిశీలించారు.కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ రాధాకాంత్, శిరీష, పలు శాఖల అధికారులతో పాటు పలువురు గ్రామ పెద్దలు. పార్టీల నాయకులు. కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని నీలకంఠపురంలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపును ఎపి టిడ్కో ఛైర్మన్ జమ్మాన్న ప్రసన్నకుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమము ద్వారా గ్రామాల్లో హెల్త్ క్యాంపు నిర్వహించి అందులో వారికి అవసరమైన పరీక్షలు చేయడం పాటు, మందులు,ఇచ్చే బాధ్యత కూడా ప్రభుత్వమే ఇస్తున్నారని అన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు జెఎఎస్ క్యాంపు లో ప్రతీ కౌంటర్ వద్ద ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.

సాలూరు రూరల్ : మండలంలోని మరిపల్లిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిసి ఛైర్‌పర్సన్ దండి అనంత కుమారి, మండల వైసీపీ అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ పార్వతి, స్థానిక సర్పంచ్ తొత్తడి నారాయణమ్మ, ఎంపిటిసి జన్ని సింహాచలం, వైసిపి నాయకులు దండి శ్రీనివాసరావు, కాగాన పోలి నాయుడు, వైద్యులు అక్యాన అనిల్, సచివాలయ, వైద్య సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



కురుపాం : ఇ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

ఇ- క్రాప్ నమోదు తప్పనిసరి : జెసి

ప్రజాశక్తి - కురుపాం

మండల పరిధిలోని మేజర్ పంచాయతీ కురుపాంలో నిర్వహిస్తున్న పంట నమోదు కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటల సాగు చేసిన రైతుల వివరాలను తప్పవని ఇ- క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఇ- క్రాప్ నమోదు చేయించుకున్న రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు వర్తిస్తాయని తెలిపారు. పంట ఉత్పత్తులను అమ్ముకోవాలన్నా ఇ- క్రాప్ నమోదు తప్పనిసరి అని తెలిపారు. పిఎం కిసాన్ పథకానికి అర్హులైన ప్రతి రైతుకు ఇకెవైసి చేయించు కోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సహాయకులు నిర్మల జ్యోతి, తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, వ్యవసాయ, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం: ఇకెవైసి చేయించుకున్న రైతు నుండే ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, ఆ విధంగా ప్రతి రైతు తప్పనిసరిగా ఇకెవైసి నమోదు చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు రైతులకు సూచించారు. మండలంలోని దశమంతపురం, చలివేంద్ర గ్రామాల్లో పర్యటించారు. ఇ-క్రాప్ బుకింగ్‌తో ఇకెవైస్ నమోదు కూడా వేగవంతం చేయాలని వ్యవసాయ అధికారులకు ఆదేశించారు. మండలంలో ఇంతవరకు ఇ-క్రాప్ బుకింగ్ క్రాప్ ఎంత శాతం నమోదైంది, ఇకెవైసి ఎంత శాతం నమోదయిందని స్థానిక ఎఒ జె.సౌజన్యను ప్రశ్నించగా మండలంలో ఇ-క్రాప్ బుకింగ్ 90శాతం, ఇకెవైసి 80శాతం నమోదైనట్లు వివరణ ఇచ్చారు. జెసి వెంట విఆర్ఒలు జి.రాజేంద్రప్రసాద్, సురేష్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఓర్వలేక జైల్లో పెట్టారు : శత్రుచర్ల

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రంలో టిడిఎ కి వస్తున్న ప్రజాదారణ చూసి ఓర్వలేక కడుపు మంట, అక్కసుతోనే అక్రమంగా కేసులు బనాయించి సంక్షేమం, అభివృద్ధి చేసిన చంద్రబాబును అరెస్టు చేసి జైల్లో పెట్టారని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు విమర్శించారు. మేము సైతం- బాబుకోసం" అన్న కార్యక్రమంలో భాగంగా గుమ్మలక్ష్మీపురంలో టిడిపి శ్రేణులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శత్రు చర్ల విజయరామరాజు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ జగదీశ్వరి పాల్గొని మాట్లాడారు. చంద్రబాబును విడుదల చేసే వరకూ తమ పోరాటాలు ఆగవని హెచ్చరించారు. చంద్రబాబునాయుడును వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో భాగంగా వైసిపి గుడ్డి ప్రభుత్వం కళ్లు తెరిపిద్దాం మంటూ శనివారం రాత్రి 7 గంటల 5 నిమిషాల పాటు ఇళ్లలో లైట్స్ ఆఫ్ చేయాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. బయటకు వచ్చి దీపాలు, సెల్‌ఫోన్ టార్చ్ లేదా కొవ్వొత్తులు వెలిగిద్దాం. రోడ్డుపై ఉంటే వాహనాల లైట్లు బ్లింక్ చేద్దాం అంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అరుకుపార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ , ఎంపిపి బొంగు సురేష్, నియోజకవర్గ మహిళ దాసరి జ్యోతిర్మయి, అరుకు పార్లమెంట్ ఎస్‌టి సెల్ ప్రధానకార్యదర్శి నందివాడ కష్ణబాబు, అరుకు పార్లమెంట్ కొప్పలవెలమ సాధికార సమితి అధ్యక్షులు ఎం.సత్యంనాయుడు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోల రంజిత్ కుమార్, అరుకు పార్లమెంట్ కార్యవర్గ సభ్యులు ఎం.విజయఅంకుశం, తెలుగు మహిళా విభాగం కార్యదర్శి వెంపటాపు భారతి, మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని జమదాలలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్‌తో కలిసి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిమినల్ మనస్తత్వంతో ప్రజావ్యతిరేక పాలనను ప్రశ్నిస్తున్న కారణంగా ప్రధాన ప్రతిపక్షనేతపై అక్రమ కేసులు జైలు పాలుచేయడాన్ని ప్రజలంతా ఏవగించుకుంటున్నారని అన్నారు. ఈ రిలే నిరాహారదీక్షకు జనసేనతో పాటు మండలానికి చెందిన పలు గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా



పార్వతీపురం : దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ జగదీష్

గ్రామానికి చెందిన 100 మంది టిడిపిలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి భారతి, ఎంపిటిసి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుల దొగ్గ మోహనరావు, జి.వెంకటనాయుడు, బొబ్బిలి వేణుగోపాలరావు, కొల్లి తిరుపతిరావు, మాజీ సర్పంచులు బేత లక్ష్మణరావు, గొరజాన చంద్రమౌళి, తాన్న తిరుపతిరావు, నాయకులు పోల సత్యనారాయణ, కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, బర్నాల సీతారాం, జాగాన రవికుమార్, పాలకొండ రాజశేఖర్, సిరిపురపుభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మార్కొండపుట్టిలో శుక్రవారం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి గుమ్మడి సంధ్యారాణి ఆధ్వర్యాన పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా సంధ్యారాని మాట్లాడురతూ చంద్రబాబు విడుదల అయ్యేవరకు నిరసనలు కొనసాగుతూనే ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మావుడి ప్రసాదరావు నాయుడు, మండల టిడిపి అధ్యక్షులు గొల్ల వేణుగోపాల్, మాజీ సర్పంచ్ ఎ. తిరుపతిరావు, కార్యదర్శి బి.గౌరీశంకర్రావు, పి.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. వందలాది మంది కార్యకర్తలతో కార్యక్రమం అనంతరం గడపగడపకు కార్యక్రమం చేపట్టారు.

సీతంపేట : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా చేపట్టిన నిరాహారదీక్షలు కొనసాగాయి. రాష్ట్ర కార్యదర్శి కర్నెన అప్పలనాయుడు మాట్లాడుతూ చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి కర్నెన అప్పలనాయుడు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, అరకు పార్లమెంటరీ అధ్యక్షులు నివర్తి శశికుమార్, సీతంపేట మండల పార్టీ అధ్యక్షులు సవర తోట మొఖలింగం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని డిప్యూటీ సిఎం పి.రాజన్న దొర తెలిపారు. మండల వైసిపి అధ్యక్షులు గొట్టాపు ముత్యాలునాయుడు అధ్యక్షతన శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాజన్నదొర మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ప్రతి పని ప్రజలకు వివరించాలన్నారు. అలాగే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ వివరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల, జెడిపి వైస్‌ఛైర్మన్ కె.సింహాచలం, వైసిపి నాయకులు డి.బాబ్జీ, పి.వీరం నాయుడు, టి.గౌరీశ్వరరావు, వైస్ ఎంపిపిలు ఎం.నారాయణ, రవీంద్ర, ఎంపిటిసి సభ్యులు సర్పంచులు, జెసిఎస్ కన్వీనర్లు, గృహసారథులు, సమన్వయకర్తలు, కార్యకర్తలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

భామిని : పేదలకు సంక్షేమ పథకాలు మళ్లీ రావాలంటే జగన్‌కు మద్దతు తెలపాలని ఎమ్మెల్యే విశ్వాసరాయ కళావతి అన్నారు. సింగిడి గ్రామంలోని శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి కల్యాణ మండపం లో శుక్రవారం జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వాసవాలు ప్రజలకు చెప్పాలని, రాబోయే ఎన్నికలు లో గెలుపు దిశగా కార్యకర్తలంతా పనిచేయాలని కోరారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. నియోజకవర్గ పరిశీలకులు గోండు కృష్ణమూర్తి, సర్పంచుల సంఘం అధ్యక్షులు దమలపాటి. ఉమామహేశ్వరావు, వైసిపి కన్వీనర్ తోట సింహాచలం, వై సి పి జిల్లా ఉపాధ్యక్షులు కొవ్వాడ చిరంజీవులు, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార స్టాల్ పరిశీలన

ప్రజాశక్తి-గరుగుబిల్లి

కొమరాడ ఐసిడిఎస్. ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నాగూరులో శుక్రవారం అంగన్వాడీ వర్కర్లు ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్‌ను జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు, మండలప్రత్యేక అధికారి ఒ ప్రభాకర్, ఎంపిడిఒ జి.పైడితల్లి తదితరులు పరిశీలించారు. అనంతరం భాస్కరరావు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనతను నివారించేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రావివలస పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె.కార్తీక్, ఎంపిడిఒ కార్యాలయం ఎఒ నాలి అర్జునరావు, వైసిపి నాయకులు కేతిరెడ్డి అచ్యుతరావు, అక్కేన వెంకట నాయుడు, వైద్యసిబ్బంది గుంట్రెడ్డి.సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న జెఎఎస్ ప్రోగ్రాం అధికారి భాస్కరరావు

రోగులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పిహెచ్‌సిల్లో అన్ని వేళలా వైదులు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఎంపిపి మజ్జి శోభారాణి అన్నారు. శుక్రవారం పెదబొండపల్లి ప్రాథమిక అరోగ్య కేంద్ర ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆమె మాట్లాడుతూ పిహెచ్‌సి పరిధిలో సుమారు 8 పంచాయతీలకు సంబంధించిన రోగులు నిత్యం సేవలు నిమిత్తం వస్తుంటారని వారి అవసరాలను గుర్తించి మందులు అందుబాటులో ఉంచాలని, అలాగే పాముకాటు, కుక్కకాటు మందులకు కొరతలేకుండా చూడాలని అన్నారు. పిహెచ్‌సిలోనే సాధారణ ప్రసవాలు జరిగేలా సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని, అందుకు వైద్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అకిబ్ జావేద్, అసుపత్రి వైద్యాధికారులు డాక్టర్ అనూష్, డాక్టర్ ధరణి, ఎమ్మార్‌నగరం, పెదబొండపల్లి సర్పంచ్‌లు వంగపండు లక్ష్మి, త్రినాథ, సవరపు తౌడమ్మ అసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతి పాఠశాలలో సక్రమంగా అమలు చేయాలని ఎంపిడిఒ సాల్మన్ రాజు, ఎంఇఒ చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం వనకాబడిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని అనంతరం గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా నిర్వహించి విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చూడాలని ఆదేశించారు. అలాగే పాఠశాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ఆహ్లాదకరంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఎం.రాజేంద్ర, సి ఆర్ పి చిరంజీవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.శంకర్రావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ, ఎంఇఒ

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని ఐదు సచివాలయాల పరిధిలో ఉన్న ఏడు వార్డు వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.జయరాం తెలిపారు. ఈనెల 7నుంచి 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూ ఆధారంగా అర్హులను ఎంపిక చేస్తామని కమిషనర్ జయరాం ఒక ప్రకటనలో తెలిపారు.

కురుపాం : మండలంలో ఖాళీగా ఉన్న వాలంటరీ పోస్టలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపిడిఒ వివి శివరామప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాం మేజర్ పంచాయతీలో మూడు, పొడి పంచాయతీలో రెండు వాలంటరీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల నుంచి 11 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఈనెల12న దరఖాస్తులు పరిశీలన, 13న కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక ద్వారా మౌలిక పరీక్ష నిర్వహించి, 15న ఎంపిక కాబడిన వాలంటీర్లను నియమించడం జరుగుతుందని అన్నారు.

ఆశయ సాధనకు ప్రణాళికతో ముందుకెళ్లాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విద్యార్థులు ఆశయ సాధన కోసం ఆచరణాత్మక ప్రణాళికతో ముందుకు వెళ్తే విజయం దక్కుతుందని జాతీయ ఉపాధి సేవా, యంగ్ ప్రొఫెషనల్ సంస్థ ప్రతినిధి అజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధి అవకాశాలపై ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడారు. విద్యార్థిగా ఉంటూ, విద్య అనంతరం ఎలాంటి ఉపాధి అవకాశాలు పొందవచ్చు అనే అంశంపై అవగాహన కల్పించారు. నేషనల్ కెరీర్ ఆపర్చునిటీస్‌లో భాగంగా విద్యార్థులకు అనేక ఉపాధి, శిక్షణ అవకాశాలు ఉన్నాయని, వీటిని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.శ్రీవరం మాట్లాడుతూ డిగ్రీ చదువుతున్న విద్యార్థులంతా ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకొని భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి-సీతంపేట

స్థానిక బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల వృత్తాంతర శిక్షణలో భాగంగా శుక్రవారం బయాలజీ సైన్స్, ఫిజికల్ సైన్స్‌పై రిసోర్స్ పర్సన్‌లు శిక్షణ ఇచ్చారు డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి విద్యార్థులకు సులభ పద్ధతులద్వారా బోధించాలని అన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

ప్రజాశక్తి - సీతంపేట

ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకులపై హౌస్ అరెస్టు చేసి ప్రజా ఉద్యమాన్ని ఆపలేరని ఆర్‌పిఐ పార్టీ జిల్లా అధ్యక్షులు గొర్లె గడ్డెయ్య ఖండించారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సంతబొమ్మాళి మండలం మూలపేటలో నిర్మిస్తున్న పోర్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి అఖిలపక్ష నేతలు మహా ధర్నాకు పిలుపునివ్వడంతో శుక్రవారం వేకువ జామున అఖిలపక్ష నేత సీనియర్ జర్నలిస్టు శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పేడాడ పరమేశ్వరావును పోలీసులు గృహనిర్బంధం చేయడం అన్యాయమన్నారు. పోర్టు నిర్మిస్తున్న ప్రాంతంలో అనేక సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించే బాధ్యత ప్రభుత్వం ఉందని అన్నారు. అణిచివేతతో ఉద్యమాలు ఆపలేరని అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమం చేసే నాయకులకు తమ పార్టీ అండగా ఉంటుందన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని లచ్చిరాజుపేట కూడలిలో శుక్రవారం ఆటోను బైక్ ఢీకొనడంతో ఇరువురికి గాయాలైనట్లు ఔట్‌పోస్టు పోలీసులు తెలిపారు. సంఘటనలో పెదబొండపల్లి నుంచి తాళ్లబురిడి ఆటోలో ప్రయాణిస్తున్న మడక వరలక్ష్మి అనే మహిళ తీవ్రంగా గాయపడగా, ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న పత్తిగుళ్ల వంశీ కూడా గాయపడ్డాడు. వీరిరువుర్ని స్థానికులు 108 వాహనంతో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా, వైదులు చికిత్స అందిస్తున్నారు.



చికిత్స పొందుతున్న వరలక్ష్మి

నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదభోగిల పంచాయతీ పరిధిలో సువర్ణముఖీ నది నుండి స్థానిక శివాలయం సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్‌ను స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పట్టుకున్నారు. ఈ ట్రాక్టర్లను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్టు తెలిసింది.